క్లుప్తంగా

జాతీయ నేతకు స్వాగతం



ఉదయభానును సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రాష్ట్ర పర్యటనలో ఉన్న అఖిల భారత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభానుకు.. శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం యూత్ కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇందులో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, ప్రధాన కార్యదర్శి నరేశ్ ముదిరాజ్, రమేశ్, జూలపల్లి శ్రీను, విజయ్ తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



లైట్లు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం మాదాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో, ఎంపీ మల్లురవి అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేసిన రూ.1.5 లక్షలతో లైట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు నర్సింహులు, అజీజ్, నాయకులు కృష్ణయ్యగౌడ్, ఇస్తారి, చంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, పెంటయ్య, ఆంజనేయులు, చంద్రమౌళి, నెహ్రూబాబు, పరశురాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న ఏఐసీసీ కో-ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీలు ప్రస్తుతం పొంగిపొర్లుతున్నాయి. కాలనీవాసుల విన్నపం మేరకు ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి శనివారం గల్పర్ వాహనాన్ని తెప్పించి నిండిన డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కాలనీవాసులకు ఆయన హామీనిచ్చారు. డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్, మాజీ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ, ఏఈలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షుడు ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, నవారు యాదిరెడ్డి, అరవింద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

నేడు బ్రాహ్మణ సంఘం సమావేశం

ఇబ్రహీంపట్నం: బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ సమావేశం పట్నంలోని చెన్నకేశవ ఆలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు వసంతరావులు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుల పరిచయం, నవంబర్ 2న ఏర్పాటు చేయనున్న కార్తీక సమారాధనకు సంబంధించి స్థల నిర్ధారణ తదితర అంశాలపై చర్చించనున్నామని పేర్కొన్నారు. సమీక్షకు సంఘం బంధువులు రావాలని కోరారు.

మంచినీటి సమస్యపై ఆందోళన

మొయినాబాద్‌రూరల్: బోరుమోటార్ మరమ్మతుకు గురై.. నాలుగు రోజులుగా హిమాయత్‌నగర్ గ్రామానికి నీటి సరఫరా లేదని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ సర్పంచ్ మంజుల తెలిపారు. శనివారం మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్‌లోని మైసమ్మ దేవాలయం వద్ద నాయకులు, వార్డు మాజీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సంఘాల నాయకులు, ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహించారు. అనంతరం మరమ్మతుకు గురైన బోరుమోటార్‌ను పరిశీలించి మాట్లాడారు. నాలుగు రోజులుగా గ్రామంలోని కాలనీ ప్రజలకు తాగునీరు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు. మాజీ ఉప సర్పంచ్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు బిస నర్సింహ, వార్డు మాజీ సభ్యుడు కుమ్మరి దర్శన్, గ్రామస్తులు బాత్కు రమేశ్, కుమ్మరి శ్రీనివాస్, మోడ అశోక్ పాల్గొన్నారు.

నిర్మాణ‘దారి’ నిర్లక్ష్యం!

- రోడ్డు నిర్మించి, ఇరువైపులా మట్టి పోయని కాంట్రాక్టర్
- పక్కనే భారీ గుంతల తవ్వకం
- ప్రమాదపుటంచున వాహనదారుల ప్రయాణం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు





సమాంతరంగా మట్టి పోయకుండా వదిలేసిన రోడ్డు

తుర్కయంజాల్: అధ్వానంగా ఉన్న కంకర రోడ్డును సగం బీటీ, మరో సగం సీసీగా నిర్మించారు. సుమారు 2.5 కి.మీ. పొడవునా నూతనంగా సుందరీకరించారు. కానీ రహదారికి ఇరువైపులా మట్టిని పోసి, సమాంతరం చేయడం విస్మరించారు. ఫలితంగా వాహనదారులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు.

ఎదురెదురుగా వస్తే..

సుమారు 45 రోజుల క్రితం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ ఏవీనగర్ నుంచి ఆదిత్యానగర్ వరకు మున్సిపల్ నిధులు రూ.90 లక్షలతో బీటీరోడ్డు, హెచ్ఎండీఏ నిధులు రూ.కోటి 20 లక్షలతో కొత్తగా సీసీ రహదారిని నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి చదును చేయలేదు. దీని వలన ఈ మార్గంలో పయనించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితిలో దిగినా కింద పడిపోతున్నారని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

గుంతలు తవ్వి..

నిర్మాణ హక్కులు పొందిన సదరు నిర్మాణ దారుడు.. నిబంధనలను పాటించకుండా రహదారి నిర్మాణం పూర్తి చేశాడు. మట్టి లేదన్న కారణంతో రోడ్డును ఒక లెవల్ చేయలేదు. పైగా మట్టి కోసం రహదారి పక్కనే భారీగా గుంతలు తొవ్వి, పలుచోట్ల సమాంతరం చేసి, మమ అనిపించాడు. ఇంత వరకు బాగానే ఉన్నా.. రోడ్డును సమాంతరం చేయడానికి.. ఆ పక్కనే భారీగా గుంతలు తీయడం మరింత ప్రమాదకరాన్ని తలపిస్తోంది. ఎవరైనా వాహనదారుడు ఏమరు పాటున ఉన్నా.. అదుపుతప్పి అందులో పడే ప్రమాదం లేకపోలేదు. ఇదే విషయమై పలువురు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్య సమాధానం ఇచ్చారని పేర్కొంటున్నారు. విద్యుత్, ఇంటర్‌నెట్ స్తంభాలు ఉన్నచోట మట్టిని తోడారు. దీంతో అవి ఎక్కువగా గాలి వీచినా, వాన పడినా కూలే ప్రమాదం లేకపోలేదని పరిసర ప్రాంత రైతులు తెలిపారు.

వీధి దీపాలు లేవు

కొత్తగా రోడ్డును నిర్మించారు. సమాంతర పనులు మరిచారు. దాంతో పాటు రహదారికి ఇరువైపులా వీధి దీపాలను ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ మార్గంలో రాత్రి పూట ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా.. వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు.. రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

రోడ్డు వేసి 45 రోజులు గడుస్తున్నా ఇరువైపులా మట్టి పోయలేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడం లేదు. స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– రేనారెడ్డి, ఆదిత్యానగర్

మట్టి దొరకక..

మట్టి దొరకక పోవడం వలనే రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోయలేదు. దానిని తవ్వడానికి అనుమతులు లభించడం లేదు. ఆ కారణంతో కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నారు. దీనికి సంబంధించి మైనింగ్ శాఖ అధికారులతో చర్చించాము. పర్మిషన్ లభించగానే.. మట్టి పోయిస్తాం.

– వినోద్, హెచ్ఎండీఏ ఏఈఈ

పరిష్కరిస్తాం



రోడ్డు వేసి, మట్టి పోయలేదు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. మట్టిపోసి రోడ్డును సమాంతరం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాము. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. రోడ్డు పక్కన మట్టిని తవ్వి పోయకూడదు. అలా చేస్తే దానికి తగినట్లుగానే బిల్లులు చెల్లిస్తాం.

– భిక్షపతి, డీఈ, తుర్కయంజాల్

ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు: ప్రజారోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం పాత్రికేయుల కోసం మెడిహబ్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన 110 మంది జర్నలిస్టులకు ఉచితంగా ఆరోగ్య, వైద్య, రక్తపరీక్షలు నిర్వహించారు. ఆర్గానిక్ హెల్త్‌కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు జైపాల్‌రెడ్డి, శ్రీరాములు, నరేందర్‌గౌడ్, మల్లేశ్ నాయక్, గణేశ్, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

16న ఉచిత మెగా వైద్య శిబిరం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో ఈ నెల 16న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఆర్ఓ పాషాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి జనరల్ వైద్య, మధుమేహ, కంటిపరీక్షలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో.. ‘యాత్రదానం’

డిపో మేనేజర్ లక్ష్మీసుధ



మహేశ్వరం: రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(ఆర్టీసీ) ఆధ్వర్యంలో యాత్రదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఎందరో అనేకులకు అనేక రకాల దానాలు చేస్తుంటారని, అలాంటి వారు అనాథలు, నిరాశ్రయులు, దివ్యాంగులు, విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే పేద వారికి విజ్ఞాన విహార యాత్రలు, పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి యాత్రదానం చేయాలని సూచించారు. ఇందులో భాగంగా వివిధ ప్యాకేజీలను సంస్థ రూపొందించిందన్నారు. యాత్రదానం చేయాలని అనుకునే దాతలు మహేశ్వరం డిపో 99522 26816 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిధుల మంజూరుపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలం, మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య కృషితో భారీగా హెచ్ఎండీఏ నిధులు విడుదల కావటం హర్షణీయమని పీపీసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి.. మండల, మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి గాను హెచ్ఎండీఏ నిధులు రూ.9.90 కోట్ల నిధులు విడుదల కావటంపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడు లేని విధంగా మండలానికి ఒకేసారి పెద్దమొత్తంలో దాదాపు 10 కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, వీధిలైట్ల ఏర్పాటు పూర్తవుతుందన్నారు. ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, నాయకులు దావల్‌గారి గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, పాండుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వీరేశం, శంకర్ ఉన్నారు.

గ్రామాల వారీగా విడుదలైన నిధులు

సీసీరోడ్లు, వీధిలైట్ల కోసం ముడిమ్యాల రూ.45 లక్షలు, ఈర్లపల్లి రూ.55 లక్షలు, కమ్మెట రూ.55 లక్షలు, చేవెళ్లకు కోటి రూపాయలు, ఎన్కేపల్లికి రూ.30 లక్షలు, చనువెల్లి రూ.55 లక్షలు, పామెనకు రూ.60 లక్షలు, కుమ్మెరకు రూ.15 లక్షలు, మల్కాపూర్‌కు రూ.30 లక్షలతో పాటు మరిన్ని గ్రామాలకు నిధులు మంజూరు అయ్యాయని పలువురు నేతలు పేర్కొన్నారు.

అధ్వాన రోడ్డు.. అవస్థల ప్రయాణం



నాగారం బీటీ రోడ్డు దుస్థితి

గుంతలమయంగా నాగారం బీటీరోడ్డు

మహేశ్వరం: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. కంకర తేలి, గోతులు ఏర్పడి కచ్చరోడ్డును తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనం నడపాలంటే ఆందోళన చెందుతున్నారు. మండల పరిధి నాగారం కూడలి శివాజీ విగ్రహం నుంచి విద్యాదయాని పాఠశాల వరకు రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. అయినప్పటికీ.. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాగారం మార్గం మీదుగా నిత్యం మహేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్, అఫ్జల్‌గంజ్, కోఠి, మెహదీపట్నం వరకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఔటర్‌రింగ్ ఎగ్జిట్ 15 రోడ్డుకు వెళ్లాలంటే ఈ గుంతల దారి నుంచే వెళ్లాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

హైటెన్షన్‌తో రైతుల బతుకులు ఆగం

అలైన్‌మెంట్‌ను మార్చండి: నాయకులు



రైతుల దీక్షకు మద్దతుగా నాయకుల నినాదం

కడ్తాల్: చిన్నసన్నకారు రైతుల పొలాల మీదుగా 765 కేవీ సోలార్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను తీస్తే.. వారి జీవనోపాధి దెబ్బతింటుందని, ఆయా కుటుంబాలు రోడ్డున పడతాయని పలువురు నాయకులు అన్నారు. రైతుల జీవనాన్ని దృష్టిలో ఉంచుకొని అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. లైన్ మార్చాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు చేపట్టిన దీక్ష శనివారానికి 6వ రోజుకు చేరుకుంది. దీక్షకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంట పొలాల మీదుగా సోలార్ పవర్ గ్రిడ్‌లైన్‌ను తీయడం అన్యాయమన్నారు. దీని వలన రైతులు నష్టపోతారని, పంటల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు ఉద్యమ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్, పెంటారెడ్డి, శ్రీరాములు, మహేశ్, రాజేశ్, రాములుయాదవ్, రమేశ్, వెంకటయ్య, గౌరటికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి

కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్



మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

మీర్‌పేట: తెలంగాణ విమోచనం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్ పిలుపునిచ్చారు. విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా శనివారం మీర్‌పేటలో పార్టీ అధ్యక్షుడు భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ వరకు చేపట్టనున్న సేవా పక్షం మున్సిపాలిటీ స్థాయి కార్యక్రమాల నిర్వహణ సమావేశానికి పాపయ్యగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటంతోనే తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని తెలిపారు. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దీంతో పాటు ప్రతీ బూత్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. ప్రధాని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు నిర్వహించి.. 75 మందితో రక్తదానం చేయించాలని చెప్పారు. సమావేశంలో నాయకులు తిరుపతిరెడ్డి, రవినాయక్, కరుణానిధి, రాజశేఖర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో విద్యారంగానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో టీచర్లు, చిన్నారులు, తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో అంగన్‌వాడీలను సందర్శించినప్పుడు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కొన్ని అంగన్‌వాడీలు శిథిలావస్థకు చేరుకోవడం, చిన్నారులు కనీసం కూర్చునేందుకు ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని సొంత నిధులతో కొన్ని అంగన్‌వాడీలలో మరమ్మతులు చేయించామని స్పష్టం చేశారు. బాలల విద్యకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ఆరు మండలాలతో పాటు రెండు మున్సిపాలిటీలకు 28 నూతన అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేసిందని వెల్లడించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచారన్నారు. ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంలో భాగంగా సర్కారు బడులలో విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే నియోజకవర్గంలో అంగన్‌వాడీలను మంజూరు చేసినందుకు పంచాయతీశాఖ, సీఆర్డీఏ, కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నాయకులు వీరేశం, శ్రీధర్‌రెడ్డి, తాండ్రశ్రవణ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో విఫలం

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతలా తిప్పలు పడిన పరిస్థితులు గతంలో ఎప్పుడు రాలేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనతో పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం ఆఫీసులు, అధికారుల చుట్టూ, రోడ్లపై బారులు తీరుతున్నారన్నారు. ఎదుగుదలలో వరి, పత్తి పూత దశలో ఉందని యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేశారన్నారు. యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులు కంటినిండా నిద్రపోని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి వారి కష్టాలు తీర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

గడువు ముగిసినా.. నాన్చుడే

రెండేళ్లు అయినా తొలగని హోర్డింగ్స్

- కొనసాగుతున్న అనధికార ప్రకటనలు
- అడ్డుగా ఉన్నాయంటూ చెట్ల నరికివేత
- పట్టించుకోని హైడ్రా, మున్సిపాలిటీ



శ్రీశైలం హైవేపై విద్యుత్ స్తంభాలకు అమర్చిన లాలీపప్స్



తుక్కుగూడలో చెట్ల కొమ్మల నరికివేత

తుక్కుగూడ: పురపాలిక సంఘం పరిధి శ్రీశైలం హైవే మధ్య లో వ్యాపార ప్రకటనల కోసం వెలసిన లాలీపప్స్ (మినీ హోర్డింగ్స్)ల గడువు ముగిసి రెండేళ్లు అయింది. అయినా నిర్వాహకులు కొనసాగిస్తున్నారు. ప్రకటనల రూపంలో ఆదాయం పొందుతున్నారు. సర్కారు ఖజానాకు గండీ కొడుతున్నారు. అయినప్పటికీ.. పురపాల అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

అధికారం తొలగించినా..

దేవందర్‌నగర్ కాలనీ నుంచి తుక్కుగూడ, తుక్కుగూడ ఔటర్ రింగు రోడ్డు మహేశ్వరం గేటు వరకు డివైడర్ మధ్యలో హైమాస్ట్ వీధి దీపాల స్తంభాలు ఉన్నాయి. వాటికి అమర్చిన లాలీపప్స్‌కు.. మున్సిపాలిటీ ఇచ్చిన పర్మిషన్ మార్చి 2024లో ముగిసింది. నాటి నుంచి ప్రభుత్వం.. మున్సిపాలిటీలకు హోర్డింగ్స్, లాలీపప్స్‌కు అనుమతులు ఇచ్చే అధికారం తొలగించింది. అయినప్పటికీ.. అవి తొలగక పోగా.. కొత్తగా వ్యాపార ప్రకటనలు దర్శనమిస్తున్నాయి.

చెట్ల కొమ్మల నరికివేత

పర్యావరణ పరిరక్షణకు హరితహారం, వనమహోత్సవం పేరిట ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు వెచ్చించి, రహదారుల మధ్యలో, ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటిస్తోంది. ఇందులో భాగంగా శ్రీశైలం హైవే డివైడర్ మధ్యన మొక్కలు నాటించింది. ఏపుగా పెరిగాయి. అలా వృక్షంలా మారిన వాటిని సైతం ప్రకటనల కోసం లాలిపాప్స్ నిర్వాహకులు కొమ్మలు నరికి, మోడుబారేలా చేస్తున్నారు. దీంతో నిన్నమొన్నటి వరకు పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపించిన ప్రదేశం కాస్త.. బోసిపోయింది. దీంతో పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఓ వైపు మొక్కలు నాటిస్తుంటే.. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటిని నరికేస్తున్నారని మండి పడుతున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవడంతో పాటు, పర్యావరణకు ముప్పు కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి, అనుమతి లేని హోర్డింగులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రాకు ఫిర్యాదు

పురపాలిక పరిధి శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న లాలీపప్స్, ఇతర వాణిజ్య ప్రకటనలకు సంబంధించిన హోర్డింగులకు అనుమతులు లేవు. వాటిని తొలగించాలని హైడ్రాతో పాటు, పురపాలిక కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం.

– శ్రీకాంత్, నేషనల్ హైవే డీఈఈ